

సోమశిలలో 54.630 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో శుక్రవారానికి 54.630 టీఎంసీలు నిల్వ ఉంది. దిగువ వివిధ కాలువలకు 1450 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.91,110
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.8,247
మూడు శాతం జీఎస్టీతో	రూ.8,494
నవర (8 గ్రాములు)	రూ.67,952

గరిష్టం/కనిష్టం
35.7 /26.4

వాతావరణం

జిల్లాలో వాతావరణం శనివారం పొడిగానే ఉంటుందని ఆ శాఖ అధికారులు తెలిపారు. గాలిలో తేమ శుక్రవారం 64 శాతంగా నమోదైంది.

ఇఫ్తార్ | సహర్
శనివారం | ఆదివారం
సా: 6.22 | ఉ: 4.53

రంజాన్ వేళలు

న్యూస్‌రీల్

ఒకరికి ఐదేళ్ల జైలు

- లైంగిక వేధింపులు, హత్యాయత్నం కేసులో తీర్పు

నెల్లూరు (లీగల్): బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడి, ఆ తర్వాత హత్యాయత్నం చేశాడని నమోదైన కేసులో నేరం రుజువు కావడంతో వింజమూరు మండలం వేంకటాద్రిపాళెం గ్రామానికి చెందిన రేపన కృష్ణ నిందితుడికి ఐదేళ్ల జైలు, రూ.1,000 జరిమానా విధిస్తూ నెల్లూరు పోక్సో ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి సిరిపిరెడ్డి సుమ శుక్రవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.. వెంకటాద్రిపాళెం గ్రామానికి చెందిన బాలిక తండ్రి స్టోన్ క్రషర్‌లో పనిచేస్తున్నాడు. నిందితుడు కృష్ణ కూడా అక్కడే పని చేస్తున్నాడు. నిందితుడు ప్రతి రోజు బాలిక వెంట పడుతూ లైంగిక వేధింపులకు గురి చేసేవాడు. ఈ నేపథ్యంలో 2013 మే 6వ తేదీ సాయంత్రం 5–30 గంటల సమయంలో ఆ బాలిక బహిర్భూమికి కంప చెట్లలోకి వెళ్లింది. ఇది గమనించిన నిందితుడు ఆ బాలిక వెనుక వచ్చి బలవంతం చేశాడు. ఆమె నిరాకరించడంతో కోపంతో బలవంతంగా లాక్కెళ్లి సమీపంలోని బావిలో పడేసి వెళ్లాడు. ఆ బాలికను స్థానికులు గుర్తించి బయటకు తీసి చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మరుసటి రోజు బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు వింజమూరు పోలీసులు కేసు నమోదు చేశారు. విచారణలో నిందితుడిపై నేరం రుజువు కావడంతో శిక్ష, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీ చంద్రశేఖర్ కేసు వాదించారు.

డ్వామాలో బదిలీల కౌన్సెలింగ్

నెల్లూరు (పొగతోట): జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా)లో వివిధ మండలాల్లో పనిచేస్తున్న ఏపీఓలు, ఈసీలు, టీఏలు, బీఎఫ్‌టీలు, సీఓలకు బదిలీలకు సంబంధించి శుక్రవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. స్థానిక డ్వామా కార్యాలయంలో జెడ్పీ సీఈఓ విద్యారమ, డ్వామా పీడీ గంగాభవాని ఈ ప్రక్రియ నిర్వహించారు. 15 మంది ఏపీఓలు, నలుగురు ఈసీలు, 33 మంది టీఏలు, 27 మంది సీఓలను కౌన్సెలింగ్ ద్వారా బదిలీలు చేశారు.

తమ్ముడికి డబ్బు.. తల తలకూ అప్పు

- 2017–18లో దళితుల పేరుతో ఎల్‌పీఎస్ అమలు
- ఆ భూములు టీడీపీ నేత ఆధీనంలోనే..
- భూకొనుగోళ్లలో మాయాజాలం
- రూ.4 లక్షలకు కొని రూ.8 లక్షలకు ప్రభుత్వానికి విక్రయం
- ఈనాటికీ వారికి రిజిస్ట్రేషన్ పత్రాలు ఇవ్వని టీడీపీ నేత
- రెవెన్యూ రికార్డుల్లోనూ లబ్ధిదారుల పేర్లు నమోదు కాని వైనం
- భూమి చూపించకుండానే అప్పు కట్టాలని నోటీసులు
- యాంత్రికంగా ఎస్సీ కార్పొరేషన్ అధికారుల వ్యవహారం
- లబోదిబోమంటున్న లబ్ధిదారులు



ఊటుకూరులో దళితుల కోసం కొనుగోలు చేసిన భూమి



విడవలూరు మండలం ఊటుకూరు దళితవాడకు చెందిన కోలగట్ల ప్రమీలమ్మకు 2017–18లో ఎల్‌పీఎస్ ద్వారా ఎకరా భూమిని రూ.8.25 లక్షల వంతున ఎస్సీ కార్పొరేషన్ కొనుగోలు చేసి ఇచ్చింది. ఇందుకు రుణం మంజూరు చేసింది. అయితే ఆ భూమిని ఇంత వరకు ఆమెకు అప్పగించలేదు. కనీసం రెవెన్యూ రికార్డుల్లోనూ అనుభవం నమోదు చేయలేదు. ఆ భూమి సాగులో కూడా లేదు. కాని దానికి సంబంధించి సబ్సిడీ పోను ఇప్పటి వరకు కట్టాల్సిన కంతులు రూ.1,31,175 మూడు రోజుల్లో చెల్లించాలని ఎస్సీ కార్పొరేషన్ అధికారులు డిమాండ్ నోటీసు పంపారు.

ఊటుకూరు దళితవాడుకు చెందిన దువ్వూరు సుభాషిణి పరిస్థితి కూడా ఇంతే. ఈమెకూ 2017–18లో ఎల్‌పీఎస్ ద్వారా ఎకరా భూమిని కొనుగోలు చేసేందుకు ఎస్సీ కార్పొరేషన్ రుణం మంజూరు చేసింది. ఆ భూమికి సంబంధించి సబ్సిడీ పోను ఇప్పటి వరకు కట్టాల్సిన రూ.1,31,175 మూడు రోజుల్లో చెల్లించాలని నోటీసులు పంపారు.

టీడీపీ అంటేనే 'తినడం, దోచుకోవడం, పంచుకోవడం' అని మరోసారి రుజువైంది. ఆఖరికి పేదల కడుపులు కొట్టి జేబులు నింపుకుంటున్న పరిస్థితికి ఆ పార్టీ నేతలు దిగజారిపోయారు. విడవలూరు మండలం ఊటుకూరుకు చెందిన ఓ అధికార పార్టీ నేత అవినీతి పర్వం దళితులకు శాపంగా మారింది. స్థానిక ఎమ్మెల్యే కోటరీలో కీలక అనుచరుడైన సదరు నేత గత టీడీపీ ప్రభుత్వ హయాంలో సాగించిన భూదందాతో స్థానిక దళితవర్గాలకు తీరని అన్యాయం జరిగింది. సదరు నేత జేబులు నిండగా, దళితులకు అప్పులు మిగిలాయి.

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: దళిత రైతు కూలీలను రైతులుగా మార్చే పథకాన్ని అడ్డు పెట్టుకుని విడవలూరు మండలం ఊటుకూరుకు చెందిన ఓ టీడీపీ నేత అడ్డంగా దోచుకున్నారు. అప్పట్లో అధికారాన్ని అడ్డం పెట్టుకుని బీడు భూములను రైతుల దగ్గర కొనుగోలు చేసి దళితులకు రెట్టింపు ధరలకు కట్టబెట్టించి తల తలకు రూ.లక్షల్లో అప్పుల భారాన్ని మోపాడు. 2017–18 కాలంలో అప్పటి టీడీపీ ప్రభుత్వం ఎస్సీ కార్పొరేషన్ ఎల్‌పీఎస్ (ల్యాండ్ పర్చేజ్ స్కీమ్) ద్వారా విడవలూరు మండలం ఊటుకూరులో దళితులకు భూములు కొనుగోలు చేసి ఇచ్చేందుకు ప్రతిపాదనలు చేసింది. ఈ అవకాశాన్ని స్థానిక టీడీపీ నేత తనకు అనుకూలంగా మార్చుకున్నాడు. 91 మంది దళిత లబ్ధిదారులను ఎంపిక చేసింది. ఈ మేరకు భూములు సేకరించే క్రమంలో స్థానిక టీడీపీ నేత ఆ గ్రామంలో సర్వే నంబరు 1284 నుంచి 1343 వరకు పలువురి రైతులకు చెందిన బీడు భూములను కొనుగోలు చేశాడు. ఇదే భూమిని ఎకరం రూ.8.25 లక్షల చొప్పున దళితులకు రిజిస్ట్రేషన్ చేశారు. ఇంత వరకు పక్కాగా నడిచింది. ఈ పథకం ద్వారా సారవంతమైన భూములిస్తే అవి సాగు చేసుకుని జీవితాలను హాయిగా సాగించవచ్చని దళితులు సంతోషించారు. భూములైతే రిజిస్ట్రేషన్ చేశారు. కానీ హక్కు పత్రాలు మాత్రం వారి చేతికివ్వలేదు. ఆ పత్రాలను స్థానిక టీడీపీ నేత తన వద్దే ఉంచుకుని హద్దులు చూపించిన తర్వాత పత్రాలిస్తామని నమ్మబలకడంతో వారు మిన్నకుండిపోయారు.



దువ్వూరి సుభాషిణికి ఇచ్చిన నోటీసులు

హద్దులు చూపలేదు

ఏనిమిదేళ్లుగా దళితులకు ఇచ్చిన భూములకు రెవెన్యూ అధికారులు భూమి హద్దులు చూపకపోవడంతో ఆ పేదలు భూములు సాగు చేసుకోలేకపోయారు. కొన్నేళ్లుగా ఆయా భూములకు హద్దులు చూపిస్తే తాము సాగు చేసుకుంటామని రెవెన్యూ కార్యాలయం చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నా.. వారు పట్టించుకోలేదు. ఇందుకు కారణం లేకపోలేదు. దళితులకు ఇచ్చిన భూములపై స్థానిక టీడీపీ నేత కన్నుండడంతో అధికారులను భయపెట్టి ఆ భూముల హద్దులు చూపొద్దని ఆదేశాలివ్వడంతో ఇప్పటికీ అధికారులు హద్దులు చూపించే ప్రయత్నం చేయకపోవడంతో ఆ భూముల్లో కంప చెట్లు మొలిచి అడవిని తలపిస్తోంది. ఈ విషయంలో రెవెన్యూ అధికారులు చెబుతున్న మాటలు సైతం అసంబద్ధంగా ఉన్నాయి. ఆ భూమిలో కర్రతుమ్మ చెట్లు ఉండడంతోనే లబ్ధిదారులకు భూములు ఇవ్వలేకపోతున్నామంటూ చెప్పడం హాస్యాస్పదంగా ఉన్నాయి.

భూ కొనుగోళ్లలో టీడీపీ నేత అవినీతి పర్వం

గత టీడీపీ ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి అండతో దళిత వర్గాలను ఉద్ధరిస్తున్నామని భూదందా నడిపించిన స్థానిక టీడీపీ నేత అవినీతి పర్వానికి తెర తీశారు. ఊటుకూరులో బీడు భూములను రైతుల దగ్గర నుంచి ఎకరం రూ.4 లక్షల వంతున కొనుగోలు చేశాడు. ఆ భూములనే ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఎల్‌ఏపీసీ పథకం కింద ఎకరా రూ.8.25 లక్షల వంతున కొనుగోలు చేయించారు. ఇటు ఎస్సీ కార్పొరేషన్ ఖజానాకు, అటు లబ్ధిదారులైన ఎస్సీలను మోసగించాడు. ఈ భూముల క్రయవిక్రయాల్లో సుమారు రూ.4 కోట్ల కుంభకోణం జరిగినట్లు స్పష్టమవుతోంది.


అగ్రిమెంట్లతో దళితుల భూముల విక్రయాలు

ఎల్‌పీఎస్ ద్వారా దళితులకు ఇచ్చిన భూములను సదరు టీడీపీ నేత ఇతరులకు అగ్రిమెంట్ల ద్వారా విక్రయాలు చేసి సొమ్ము చేసుకుంటున్నట్లు ఆరోపణలున్నాయి. ఇప్పటికే సగం భూములు విక్రయించి రూ.కోట్లు జేబుల్లో వేసుకున్నట్లు దళితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎక్కడ తమ భూముల గురించి అడిగితే ఏం చేస్తారో అనే భయంతో ఉన్నట్లు ఆవేదన చెందుతున్నారు. ఈ విషయమై ఇప్పటికే సదరు లబ్ధిదారులైన దళితులు పలుమార్లు స్థానిక ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డికి, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. కానీ ఆమె స్పందించకపోవడంతో సీఎం చంద్రబాబుకు ఫిర్యాదు చేశారు.

రుణం కట్టాలని డిమాండ్ నోటీసులు

ఇదిలా ఉంటే.. ఎనిమిదేళ్లుగా ఆ భూములను లబ్ధిదారులకు అధికారులు అప్పగించలేదు. కనీసం హద్దులు చూపించకపోగా, రెవెన్యూ రికార్డుల్లో కూడా వారి పేరుతో అనుభవం కూడా నమోదు చేయలేదు. అయితే ఎల్‌పీఎస్ ద్వారా కొనుగోలు చేసిన ఆ భూములు సదరు లబ్ధిదారుల పేరిట బదలాయింపు జరిగిందా లేదా? సాగు చేస్తున్నారా లేదా? అనే విషయాలను కూడా ఎస్సీ కార్పొరేషన్ అధికారులు ఏళ్లకు ఏళ్లు పరిశీలించకపోవడం ఆ శాఖాధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. అయితే ఆ భూముల పథకం రుణాలు చెల్లించాలని ఎస్సీ కార్పొరేషన్ అధికారులు లబ్ధిదారులకు నోటీసులు పంపడంతో దళితులు లబోదిబోమంటున్నారు. అసలే కాయకష్టంతో బతికే తమ కుటుంబాలను టీడీపీ నేతలు వీధిన పడేలా చేస్తున్నారని వాపోతున్నారు. భూములు సాగు చేయకుండానే రూ.లక్షల్లో రుణం చెల్లించాలని నోటీసులు ఇవ్వడంపై ఎస్సీ కార్పొరేషన్ అధికారుల తీరుపై ఎస్సీ సంఘాలు మండి పడుతున్నాయి.

చెట్లు ఉండడంతో హద్దులు చూపించలేదు



ఎల్‌పీ స్కీమ్‌లో ఇచ్చిన భూముల్లో కంప చెట్లు ఉండడంతో వాటికి హద్దులు చూపించలేకపోతున్నాం. ఆ భూముల్లో ఉన్న చెట్లు తొలగించుకుని వస్తే అప్పుడు సర్వే చేసి హద్దులు చూపిస్తాం.

– పీ చంద్రశేఖర్, తహసీల్దార్ విడవలూరు

హద్దులు చూపించకుంటే ఎలా



2018లో మాకు ఒక్క ఎకరా చొప్పున ప్రభుత్వం మొత్తం 91 ఎకరాల విస్తీర్ణంలో పొలాన్ని ఇచ్చారు. అయితే 91 ఎకరాలకు నాలుగు వైపులా హద్దు రాళ్లను ఏర్పాటు చేయకుండా జంగిల్ క్లియరెన్స్ చేసుకోమంటే ఎలా చేసుకోవాలి.

– చనుమూరి సరోజనమ్మ

పొలం చూపించలేదు.. లోన్ కట్టాలంట!



మాకు మంజూరైన పొలం 8 ఏళ్లుగా ఎక్కడ ఉందో ఇంత వరకు తెలియదు. అధికారులకు ఎన్నిసార్లు మొర పెట్టుకున్నా.. మమ్మల్ని పట్టించుకోలేదు, ఇప్పుడేమో లోన్ కట్టాలంటూ మాకు ఎస్సీ కార్పొరేషన్ నుంచి నోటీసులు వచ్చాయి. అసలు మా పొలం ఎక్కడుందో మాకు తెలియదంటే లోను కట్టాలంటూ నోటీసులు పంపడం హాస్యాస్పదంగా ఉంది.

– కర్లగుంట శీనమ్మ

కేజీబీవీల్లో ప్రవేశాలకు దరఖాస్తులు

నెల్లూరు (టౌన్): కేజీబీవీల్లో 6వ తరగతి, ఇంటర్‌లో ప్రవేశాలకు ఈ నెల 22వ తేదీ నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సమగ్రశిక్ష ఏపీసీ వెంకట సుబ్బయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒక్కొక్క తరగతిలో 480 వంతున సీట్లు ఉన్నాయి. అనాథ, బడి బయట పిల్లలు, డ్రాపౌట్స్, పేద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ బాలికలు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

పచ్చ నేతల 'బరి' తెగింపు

టీడీపీ నేతలు 'బరి' తెగించారు. జిల్లాలోని కావలి మండలం చెన్నాయపాళెం వద్ద చట్ట విరుద్ధంగా పక్కాగా కోడి పందేలు, పేకాట బరులు ఏర్పాటు చేయడమే కాకుండా ప్రేక్షకుల కోసం రెండు వరుసల్లో గ్యాలరీలు ఏర్పాటు చేసి టికెట్లు వసూలు చేశారు. సుమారు వెయ్యి మంది వీక్షకులు కూర్చొని చూసే విధంగా సీటింగ్ ఏర్పాటు చేశారు. అక్కడే బిర్యానీలు, ఇతర తినుబండారాలు అమ్ముకునేందుకు 'వేలం' పెట్టారు. గత మూడు రోజుల పాటు జరిగినా.. ఒక్క పోలీస్ కూడా అటు వైపు కన్నెత్తి చూడలేదంటే ఇక్కడి పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. నిర్వాహకుల మధ్య తలెత్తిన పంపకాల్లో విభేదాల నేపథ్యంలో వారిలో వారే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో విధిలేని పరిస్థితుల్లో అక్కడికి వెళ్లి హడావుడి చేశారనే విమర్శలు వినిపిస్తున్నాయి. పోలీసులకు ఓ కుటుంబం సమాచారం అందించినట్లు అనుమానించి వారిపై దాడికి తెగబడ్డారు.



సిద్ధం చేసిన కోడిపందేల బరి



జూదం నిర్వహణకు టెంట్‌లతో ఏర్పాటు చేసిన వేదిక

- పక్కాగా కోడి పందేలు, పేకాట బరులు
- నిర్వాహకుల మధ్య పంపకాల్లో విభేదాలు
- వారిలో వారే పోలీసులకు సమాచారం
- ఖాకీల రాకతో నిర్వాహకులు, పందెం రాయుళ్లు పలాయనం
- అనుమానంతో ఒక కుటుంబంపై దాడి

సాక్షి, టాస్క్‌ఫోర్స్: కావలి మండలం చెన్నాయపాళెంలో అధికార పార్టీ నేతలు పక్కాగా కోడి పందేల బరిని, పేకాట శిబిరాన్ని ఏర్పాటు చేయడమే కాకుండా, బెట్టింగ్‌లు నిర్వహించారు. కోడి పందేలు వీక్షించేందుకు రెండు వరుసల్లో గ్యాలరీలు పెట్టి, టికెట్లు కూడా ఏర్పాటు చేయడం విశేషం. బరికి ఆనుకుని ఉండే వరుసలో రూ.1,000 కాగా, ఆ తర్వాత వరుసకు రూ.700 టికెట్ ధరలుగా నిర్ణయించారు. బిర్యానీలు, ఇతరాలు అమ్మకాలు చేసేందుకు కొంత నగదు తీసుకుని అనుమతులిచ్చారు. బరికి సమీపంలోనే మద్యం విక్రయాలు సిద్ధం చేశారు. చెన్నాయపాళెం ఎస్సీ కాలనీ సమీపంలో పుచ్చ తోటల్లో ఈ ఏర్పాట్లు చేసి మూడు రోజుల పాటు నిర్వహించారు. నిర్వాహకుల మధ్య వివాదాలు రావడం, పోలీసులు హడావుడి చేయడంతో నిలిపి వేశారు. చెన్నాయపాళెం నుంచి పెద్దపట్టుపుపాళెం రోడ్డు మీదుగా కోడి పందేల బరికి చేరుకునే విధంగా రోడ్డు వసతి ఉండే విధంగా సిద్ధం చేశారు. పెద్ద ఎత్తున ఇక్కడ జూద క్రీడల హడావుడి జరిగినా కనీసం పోలీసులకు సమాచారం లేదంటే నమ్మశక్యంగా కూడా లేదు.

ఓ కుటుంబంపై దాడి

ఈ కోడి పందేల బరి ఏర్పాటు చేసిన నిర్వాహకుల్లో కొందరు ఒక కుటుంబంపై దాడి చేశారు. నిర్వాహకుల నడుమ తలెత్తిన విభేదాలతో కోడి పందేల కార్యకలాపాలు నిలిచిపోవడంతో గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన చౌటూరు శాంతమ్మ, రాములమ్మ, సాయి తదితరులపై గురువారం రాత్రి దాడి చేశారు. పోలీసులకు మీరే సమాచారం ఇచ్చారని వారిపై అకారంగా దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. బాధితులు కావలి పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో చేరి చికిత్స పొందుతున్నారు. బాధితుల్లో చౌటూరు శాంతమ్మ 65 ఏళ్ల వృద్ధురాలు. ఆమె చెయి విరిగింది.



కోడిపందేలు నిర్వాహకుల దాడిలో గాయపడి చికిత్స పొందుతున్న వృద్ధురాలు శాంతమ్మ

కోడి పందేలు బరి.. ప్రచారం మాత్రం క్యాసినో

నిర్వాహకులు జూదగాళ్ల జేబులు ఖాళీ చేసి, తమ జేబులు నింపుకోవడానికి విస్తృత ప్రచారం చేశారు. కోడి పందేల కోసమే ఒక బరిని సిద్ధం చేశారు. దీంతో పాటు పేక ముక్కలతో ఆడే వివిధ రకాల ఆటల్లో పాల్గొనే జూదగాళ్ల కోసం 'క్యాసినో' నిర్వహిస్తున్నట్లు అంతర్గత ప్రచార సాధనాల ద్వారా ప్రచారం చేశారు. ఈ క్రమంలో ఉమ్మడి నెల్లూరు, ప్రకాశం జిల్లాల నుంచి వందల సంఖ్యలో కార్లు చెన్నాయపాళెంకు చేరుకున్నాయి. కోడి పందేలు చూసేందుకు ప్రేక్షకులు బరి వద్దకు భారీగా తరలి వచ్చారు. ఈ విధంగా మూడు రోజులు ఈ జూద క్రీడలు నిర్వహించారు. పోలీసుల రాకతో నిలిపేశారు.

రాబడి పంపకాల్లో విభేదాలు

నిర్వాహకులకు భారీగానే రాబడి కూడా వచ్చింది. దీంతో పంపకాల విషయంలో వారి మధ్య గురువారం విభేదాలు తలెత్తాయి. ఈ క్రమంలో ఈ వ్యవహారాన్ని నిర్వాహకుల్లో వారిలో వారే గ్రామంలోని వాట్సాప్ గ్రూపులో ఉదయం 8.30 గంటలకు ఒక పోస్టు పెట్టారు. ఈ సమాచారం పోలీసులకు చేరింది. కావలిరూరల్ ఎస్‌ఐ బాజీబాబు ఆధ్వర్యంలో సిబ్బంది ఉదయం 9 గంటలకు అక్కడికి చేరుకున్నారు. దీంతో అక్కడున్న నిర్వాహకులు, జూదగాళ్లు పొలాల్లో ఎటు పడితే అటు పరుగులెత్తి తప్పించుకున్నారు.

పుచ్చ రైతులు అభ్యంతరం చెప్పినా..

ఇదిలా ఉండగా కోడి పందేలు వేయడానికి సిద్ధం చేసిన బరి పుచ్చ తోటలో ఉండడంతో ఆ పంట సాగు చేసిన రైతులు అభ్యంతరం చెప్పారు. పెద్ద సంఖ్యలో తమ పుచ్చ తోటలోకి జనాలు రాకపోకలు సాగిస్తే పుచ్చతోట ధ్వంసం అవుతుందని రైతులు కోడి పందేల నిర్వాహకులకు చెప్పారు. అయినా వారు ఖాతరు చేయలేదు. పంట కాలువపై సెంట్రింగ్ రేకులతో కాలిబాట వేసి జూదగాళ్లు రాకపోకలకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేశారు. పెద్ద ఎత్తున జనాలు రావడంతో పుచ్చతోటలు ధ్వంసం అయ్యాయి.

బాధితులపైనే పోలీసులకు ఫిర్యాదు

కోడి పందేలు బరి, పేక ముక్కలతో వివిధ రకాల ఆటలు కోసం సర్వం సిద్ధం చేసిన నిర్వాహకులపై పోలీసులు ఎటువంటి చర్యలు తీసుకోలేదు. మూడు రోజులు అక్కడ జూద క్రీడలు జరిగినా పోలీసులు అటు వైపు కన్నెత్తి కూడా చూడలేదంటే అధికార పార్టీల ప్రాపకం కోసమే అనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రచ్చకెక్కినా నిర్వాహకులపై కేసు నమోదు చేయకపోగా, నిర్వాహకుల చేతిలో దాడికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులపైనే పోలీసులకు ఫిర్యాదు అందజేసినట్లుగా తెలిసింది. ఆస్పత్రిలో ఉన్న బాధితుల కేసు మెడికో లీగల్ కేసు అవుతుంది కాబట్టి, కౌంటర్ కేసుగా ముందస్తుగానే పోలీసులకు నిర్వాహకులు ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది.

క్లుప్తంగా

పోలీస్ అధికారులు, సిబ్బందికి ఉగాది పురస్కారాలు

నెల్లూరు(క్రైమ్): ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని విధి నిర్వహణలో ఉత్తమ సేవలందించిన పోలీస్ అధికారులు, సిబ్బందికి రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉగాది పురస్కారాలను ప్రకటించింది. వారిని సిబ్బందిని ఎస్పీ జి.కృష్ణకాంత్ అభినందించారు. ఉత్తమ సేవా పతకానికి డి.హరేంద్రబాబు (ఏఎస్సై, సీసీఎస్, నెల్లూరు), టి.ప్రభాకర్‌రావు (హెచ్‌సీ, నెల్లూరు రైల్వే), ఎం.వెంకటేశ్వర్లు (హెచ్‌సీ, సీఐడీ, నెల్లూరు), సేవా పతకానికి సీహెచ్ కోటేశ్వరరావు (ఇన్‌స్పెక్టర్, చిన్నబజార్ పీఎస్), వై.పాల్‌రాజు (ఆర్‌ఐ హోంగార్డ్స్), ఎస్.పాండు రంగారెడ్డి (హెచ్‌సీ, డీఏఆర్), ఎం.శంకరయ్య (ఏఆర్ ఎస్సై, డీఏఆర్), ఎంవీ సత్యనారాయణరావు (ఏఎస్సై, సీసీఎస్), ఎస్.రవికుమార్ (ఆరెస్సై, డీఏఆర్), కె.పూర్ణచంద్రబాబు (పీసీ, కావలి రూరల్), పి.శ్రీనివాసరాజు (ఏఎస్సై, బాలాజీనగర్), షేక్ నజీర్‌బాషా (హెచ్‌సీ, కోవూరు), ఎస్.కోటేశ్వరరావు (హెచ్‌సీ, డీఏఆర్), జి.సుబ్బానాయుడు (హెచ్‌సీ, వెంకటాచలసత్రం), ఎస్‌డీ నజ్మల్ హుస్సేన్ (హెచ్‌సీ, చిన్నబజారు), కె.దయానిధి (హెచ్‌సీ, సీఐడీ), ఎం.రవి (హెచ్‌సీ, సీఐడీ), సేవా పతకం స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ ఫైర్ సర్వీసెస్‌కు టి.విజయ వరకుమార్ (ఎస్‌ఎఫ్‌ఓ, పొదలకూరు), కె.రామకృష్ణ (ఫైర్‌మెన్, నెల్లూరు) ఎంపికయ్యారు.

'యువికా'కు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(టౌన్): ఇస్రో ఆధ్వర్యంలో యువికా (యువ విజ్ఞాన కార్యక్రమం)కు ఈనెల 23వ తేదీలోపు జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలల్లో 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సైన్స్ అధికారి కరుణాకర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన వారికి స్పేస్ టెక్నాలజీ, సైన్స్ అప్లికేషన్స్‌పై ప్రాథమిక జ్ఞానాన్ని అందించనున్నట్లు వెల్లడించారు. స్పేస్ గురించి విద్యార్థులకు అవగాహన కల్పించడమే కాకుండా వారిలో స్ఫూర్తిని నింపేందుకు ఇస్రో యువికా కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. మే నెలలో రెండు వారాల పాటు శిక్షణ ఇచ్చి అంతరిక్ష పరిశోధనకు సంబంధించిన ఏడు కేంద్రాలను సందర్శించే అవకాశాన్ని కల్పిస్తారన్నారు. ఎంపికైన విద్యార్థులకు ప్రయాణ, వసతి, భోజన సౌకర్యాలను ఇస్రో ఉచితంగా అందిస్తుందని తెలిపారు.

28,122 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

నెల్లూరు రూరల్: కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటి వరకు 28,122 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లుగా జేసీ కార్తీక్ తెలిపారు. శుక్రవారం 3,306 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లుగా జేసీ ప్రకటన విడుదల చేశారు. ఇప్పటి వరకు రూ.60.36 కోట్లను రైతులకు చెల్లించామన్నారు.

సచివాలయ అడ్మిన్‌పై దాడి

నెల్లూరు సిటీ: ఇంటి పన్ను విషయంలో సచివాలయ అడ్మిన్, యజమానికి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో అడ్మిన్‌పై యజమాని దాడికి పాల్పడిన ఘటన శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. నెల్లూరు రూరల్ పరిధిలోని 13–1 సచివాలయ అడ్మిన్ సెక్రటరీగా పి.వెంకటేష్ అనే వ్యక్తి వ్యవహరిస్తున్నాడు. పన్ను వసూళ్లపై అధికారులు టార్గెట్ ఇచ్చారు. దీంతో అతను రోజూ ఇంటి, కుళాయి పన్నుల నోటీసులు అందజేసి నగదు వసూలు చేస్తున్నాడు. వెంకటేష్ శుక్రవారం 13వ డివిజన్‌లోని యనమలవారిదిన్నెలోని నవీన్ అనే వ్యక్తి ఇంటికి వెళ్లి పన్ను చెల్లించాలని చెప్పాడు. ఈ క్రమంలో వారి మధ్య వివాదం చెలరేగింది. కోపోద్రిక్తుడైన నవీన్ సచివాలయ అడ్మిన్‌పై దాడి చేశాడు. నవీన్ అవుట్ సోర్సింగ్ మున్సిపల్ శానిటరీ మేస్త్రీగా పనిచేస్తున్నాడు. ఈ ఘటనపై వెంకటేష్ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'హలో వీఆర్వో మన బండ్లే.. వదిలెయ్'

కలువాయి(సైదాపురం): 'హలో వీఆర్వో.. పట్టుబడిన పొక్లెయినర్, లారీలు మనోళ్లవే.. వాటిని వదిలెయ్' అంటూ రెవెన్యూ సిబ్బందికి కూటమి ముఖ్య నేతలు ఫోన్లు చేయడం చర్చనీయాంశంగా మారింది. ఒత్తిడి కారణంగా వీఆర్వో వాహనాలను వదిలేయాల్సి వచ్చింది. దీంతో గ్రామస్తులు భీష్మించిన ఘటన కలువాయి మండలంలోని కుల్లూరులో గురువారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. కుల్లూరు గ్రామంలోని పెయ్యలతిప్ప వద్ద మూడు రోజులుగా భారీ యంత్రాలతో గ్రావెల్ తవ్వకాలు చేసి రాజుపాళెంలో ఏర్పాటు చేసిన ఇసుక ర్యాంప్‌నకు తరలిస్తున్నారు. ఎలాంటి అనుమతి లేకుండానే యథేచ్ఛగా భారీ వాహనాల్లో గ్రావెల్ తరలింపు జరుగుతోంది. ఈ నేపథ్యంలో గ్రామస్తులంతా ఒక్కటై వీఆర్వో జనార్దన్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో అతను గురువారం రాత్రి నిఘా వేసి ఒక పొక్లెయినర్, రెండు లారీలను పట్టుకున్నాడు. అప్పటి నుంచి కూటమి నేతలు వీఆర్వోకు ఫోన్లు చేసి వదిలేయమని ఒత్తిడి తెచ్చారు. భరించక అతను వాహనాలను పంపేశాడు. దీనిపై గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

వినూత్నంగా ఆలోచించి..

అరుగాలం కష్టించి పండించే పైరు అడవి జంతువుల పాలవుతుంటుంది. రక్షణ కోసం కఠిన పద్ధతుల వల్ల అవి మృతిచెందడమో, గాయపడటమో జరుగుతుంది. ఈ సమయంలో కేసులతో పోలీసుల చుట్టూ తిరగాల్సి వస్తుంది. కొందరు రైతులు తమ వరి పైరును కాపాడుకునేందుకు.. మూగజీవాలకు హాని కలగకుండా వినూత్న పద్ధతులను అవలంబిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

- వరి పైరు రక్షణకు రైతుల చర్యలు
- అడవి జంతువులకు హాని చేయకుండా..
- మైక్‌లను పెడుతున్న వైనం


మైక్‌ను చూపుతున్న రైతు నరేంద్ర


పక్షులు వాలకుండా కట్టిన రిబ్బన్లు

సోమశిల/ఆత్మకూరు: నాలుగునెలల పాటు ఎరువులు, పిండి వేసి ఏపుగా పెంచుకున్న వరి పైరును కంకి దశలో దుప్పులు, అడవి పందులు, కొన్ని గ్రామాల్లో ఎలుగుబంట్లు రాత్రి వేళల్లో తొక్కి నాశనం చేస్తుంటాయి. అవి తిరిగిన మేర పొలంలో పైరు నేలవాలడం, వడ్ల గింజలు రాలిపోవడం జరుగుతుంది. దీంతో రైతులు ఆర్థికంగా నష్టపోతుంటారు. రాత్రి వేళల్లో జంతువుల బారి నుంచి పైర్లను కాపాడుకునేందుకు కాపలా కాయడం కష్టమైన పని. ఆ సమయంలో విష పురుగుల బారిన పడి మృతిచెందిన అన్నదాతలు ఎందరో ఉన్నారు. ఈ పరిస్థితుల నుంచి పైర్లను రక్షించుకునేందుకు అనంతసాగరం మండలంలోని పెన్నాతీరం, కొండ, అటవీ ప్రాంతాల గ్రామాలైన గార్లదిన్నెపాడు, చిలకలమర్రి, పాతదేవరాయపల్లి, శంకరనగరం గ్రామాల రైతులు వినూత్నంగా ఆలోచించారు.

ఏం చేస్తున్నారంటే..

రైతులు మైక్‌లను వినియోగిస్తున్నారు. ముందుగానే జంతువులను తరుముతున్నట్లుగా అరవడం, పళ్లెం లేదా డప్పు మోగించడం తదితర శబ్దాలను రికార్డు చేసి ఉంచుతారు. దీనిని ఆన్ చేసి తమకు కావాల్సిన ప్రాంతంలో పెట్టి ఇళ్లకు వెళ్లిపోతున్నారు. చిన్న రైతులు ఎకరాకు ఒకటి పెడుతుండగా, ఎక్కువ పొలం ఉన్న వారు 4, 5 సెట్లను ఏర్పాటు చేస్తున్నారు. దీని నుంచి వచ్చే శబ్దాలతో జంతువులు పొలాల్లోకి వచ్చేందుకు భయపడుతున్నాయి. ఆ నాలుగు గ్రామాల్లో రైతులు ఈ పద్ధతిని అనుసరిస్తుండటంతో వారికి అడవి జంతువుల బాధలు తప్పాయి. అదే విధంగా పగటి వేళల్లో పక్షుల నుంచి పైర్లను రక్షించుకునేందుకు మెరిసే రిబ్బన్లను (అగ్గి రిబ్బన్లు) పొలాల్లో అక్కడక్కడా ఏర్పాటు చేస్తున్నారు. సూర్యరశ్మి రిబ్బన్లపై పడినప్పుడు పక్షుల కళ్లు భ్రమిస్తాయి. దీంతో అవి పైరుపై వాలకుండా వెళ్లిపోతాయి. ఇలా ఓ వైపు తమ పైరును రక్షించుకోవడంతోపాటు మూగ జీవాల ప్రాణాలను రక్షించేలా రైతులు అనుసరిస్తున్న ఈ విధానాలు ఇతరులకు ఆదర్శంగా నిలుస్తున్నాయి.

రక్షించుకుంటున్నాం

జంతువుల వల్ల పైరు దెబ్బతింటుండేది. నాలుగేళ్ల క్రితం మైక్‌లను పెట్టాం. జంతువులు పొలాల వద్దకు రావడం లేదు. వాటి బారి నుంచి పైర్లను రక్షించుకుంటున్నాం. ఎండ, వాన, మంచు నుంచి మైకులు పాడవకుండా ప్లాస్టిక్ కవర్లు చుట్టి కర్రలకు కట్టి పెడుతున్నాం.

– నరేంద్ర, రైతు


మెడికల్ షాపులో తనిఖీలు చేస్తున్న విజిలెన్స్ ఎస్పీ, అధికారులు

మెడికల్ షాపులపై ఆకస్మిక దాడులు

- మత్తుమాత్రల క్రయ, విక్రయాలపై పరిశీలన


మాత్రలను పరిశీలిస్తున్న అధికారులు

నెల్లూరు(క్రైమ్): ఆపరేషన్ గరుడకు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శ్రీకారం చుట్టారు. శుక్రవారం జిల్లా విజిలెన్స్ ఎస్పీ రాజేంద్రకుమార్ పర్యవేక్షణలో విజిలెన్స్, ఔషధ నియంత్రణ అధికారులు, స్థానిక పోలీసులతో కూడిన ప్రత్యేక బృందాలు ఆత్మకూరు పట్టణంలోని రామలక్ష్మణ మెడికల్స్, ఎంఆర్ మెడికల్ అండ్ ఫ్యాన్సీ, నెల్లూరు స్టోన్‌హౌస్‌పేటలోని సాయిరేఖ మెడికల్స్, శ్రీనివాస అగ్రహారంలోని అనంత సంజీవిని జనరిక్ మెడికల్ షాప్, ఆచారివీధిలోని గణేష్ మెడికల్స్, బోసుబొమ్మ సమీపంలోని రత్న మెడికల్స్‌లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. క్లోనాజెపామ్, అల్ప్రాజోలం తదితర డ్రగ్స్‌కు సంబంధించిన క్రయ, విక్రయాలపై లోతుగా పరిశీలిస్తున్నారు. ఎంత మొత్తంలో మాత్రలు కొనుగోలు చేశారు?, ఎవరికి విక్రయించారు?, వాటికి సంబంధించిన బిల్లులు, వైద్యుడి ప్రిస్క్రిప్షన్ల మేరకే విక్రయించారా? లేదా? తదితర వివరాలు సేకరిస్తున్నారు. తనిఖీల నివేదికను ప్రభుత్వానికి అందించనున్నట్లు అధికారులు తెలిపారు.

తాళాలు వేసి..

తనిఖీల నేపథ్యంలో నెల్లూరు నగరంలోని కొందరు వ్యక్తులు తమ దుకాణాలకు తాళాలు వేసేశారు. ఈ సందర్భంగా ఔషధ నియంత్రణ శాఖ ఏడీ వీరకుమార్ మాట్లాడుతూ డాక్టర్ల ప్రిస్క్రిప్షన్ల లేకుండా మత్తుమాత్రలను విక్రయించరాదన్నారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్‌లు కె.నరసింహారావు, ఎ.శ్రీహరి, షేక్ సుభానీ, డీసీటీఓ విష్ణురావు, ఏఓ పి.వేణుగోపాల్‌రావు, ఏఈఈ బి.వెంకటరెడ్డి, ఔషధ నియంత్రణ శాఖ ఇన్‌స్పెక్టర్లు కీర్తి పవిత్ర, టి.వెంకటకృష్ణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యుద్ధప్రాతిపదికన బకాయిల వసూలు

- నేటి రాత్రి గంటసేపు ఎర్త్‌అవర్‌ను పాటిద్దాం
- సబ్‌స్టేషన్లలో సిబ్బంది అందుబాటులో ఉండాలి
- ఎస్ఈ విజయన్


సమీక్ష నిర్వహిస్తున్న అధికారులు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఆర్థిక సంవత్సరం ముగుస్తున్న నేపథ్యంలో యుద్ధప్రాతిపదికన విద్యుత్ బకాయిలను వసూలు చేయాలని ఏపీఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్ఈ విజయన్ ఆదేశించారు. నెల్లూరులోని కోటమిట్టలో ఉన్న విద్యుత్ రెవెన్యూ కార్యాలయంలో శుక్రవారం ఆ శాఖ నెల్లూరు టౌన్ డివిజన్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ అదనపు విద్యుత్ లోడును క్రమబద్ధీకరించేందుకు విద్యుత్ శాఖ కల్పించిన 50 శాతం రాయితీని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. దీని గడువు జూన్ 30వ తేదీతో ముగుస్తుందన్నారు. శనివారం రాత్రి 8.30 నుంచి 9.30 గంటల వరకు వినియోగదారులు స్వచ్ఛందంగా లైట్లు ఆపివేసి ఎర్త్‌అవర్‌ను పాటించాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ కార్యాలయాలకు విద్యుత్ సర్‌చార్జ్ రద్దును వినియోగించుకోవాలని ఈ అవకాశం ఏప్రిల్ 17వ తేదీ వరకు ఉంటుందన్నారు. పీఎం సూర్యఘర్ సోలార్ పథకాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. నగరంలోని అన్ని సబ్‌స్టేషన్లలో సాయంత్రం 6 నుంచి రాత్రి 10 గంటల వరకు (పీక్ అవర్స్)లో సిబ్బంది అందుబాటులో ఉండాలని ఆదేశించారు. సైబర్ నేరగాళ్ల నుంచి విద్యుత్ సిబ్బందికి ఫోన్‌కాల్స్ వస్తున్నాయని వారి వలలో పడకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సమావేశంలో సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ మురళి, నెల్లూరు టౌన్ ఈఈ శ్రీధర్, డీఈఈలు కిరణ్, అశోక్, సునీల్, అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్స్ సురేఖ, ఆశాలత, ఏఈలు కృష్ణవేణి, విజయ్‌కుమార్, దామోదర్‌రెడ్డి, విజయ్, లక్ష్మీనారాయణ, సుధాకర్, నస్రూల్లా, సూర్య గాంధీ, మునిశేఖర్, గోపాలకృష్ణ, జేఏఓ పద్మజ తదితరులు, పాల్గొన్నారు.

అటవీ భూమి కబ్జాకు యత్నం


భూమిని చదును చేసిన దృశ్యం

సాక్షి టాస్క్‌ఫోర్స్: వెంకటగిరి నియోజకవర్గం కలువాయి మండలంలోని తోపుగుంట సమీపంలోని పది ఎకరాల అటవీ భూమిని ఓ వ్యక్తి ఆక్రమించుకునేందుకు రంగం సిద్ధం చేశాడు. ఆ భూమి సోమశిల అనుసంధానమైన చెన్నై కాలువ సమీపంలో ఉండటం గమనార్హం. రూ.కోట్లు విలువ చేసే భూమిని కలువాయికి చెందిన ఓ వ్యక్తి చదును చేసి సాగు చేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేశాడు. అలాగే ఆ భూమి సమీపంలోనే మరో 4.88 సెంట్లు ఓ వ్యక్తికి అసైన్‌మెంట్ పట్టా ఇవ్వగా.. దానిని కూడా ఆ వ్యక్తి కొనుగోలు చేసి మొత్తంగా సాగులోకి తీసుకొచ్చేందుకు సిద్ధమయ్యాడు. ఈ తంతు సంబంధిత అధికారులకు తెలిసినా పట్టీపట్టనట్టు వ్యవహరిస్తున్నారని విమర్శలున్నాయి.

షుగర్ ఫ్యాక్టరీ మూతకు కారణం టీడీపీనే..

- వైఎస్సార్‌సీపీ నేతలు


మాట్లాడుతున్న నిరంజన్‌బాబురెడ్డి, చిత్రంలో నాయకులు

కోవూరు: 'కోవూరు చక్కెర కర్మాగారం మూసివేతకు కారణం టీడీపీ అనే విషయాన్ని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి తెలుసుకోవాలి. దీనిపై అసెంబ్లీలో అసత్యాలు చెప్పడం దారుణం' అని డీఏఏబీ మాజీ చైర్మన్ నిరంజన్‌బాబురెడ్డి అన్నారు. కోవూరు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు నాటి ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి కలిసి ఫ్యాక్టరీని తిరిగి ప్రారంభించాలని కోరారన్నారు. దాని స్థితిగతులు తెలుసుకోవాలని నిపుణులతో కూడిన బృందాన్ని జగన్ పంపారన్నారు. వారు పరిశీలించి ఈ కర్మాగారం తిరిగి ప్రారంభించేందుకు అవకాశం లేదని, పూర్తిగా శిథిలావస్థకు చేరుకుందని చెప్పారన్నారు. 2013 వరకు ఉద్యోగులు, కార్మికులకు ఉన్న బకాయిలను అప్పటి ప్రభుత్వం చెల్లించిందన్నారు. 2014 – 19 వరకు టీడీపీ హయాంలో బకాయిలు ఒక్క రూపాయి కూడా ఇవ్వని విషయాన్ని ప్రశాంతిరెడ్డి తెలుసుకోవాలన్నారు. ఆ మొత్తం రూ.20 కోట్లని అసెంబ్లీ సాక్షిగా ఆమె చెప్పారని, కానీ ప్రస్తుతం రూ.22.30 కోట్లకు చేరుకుందన్నారు. ప్రసన్నకుమార్‌రెడ్డి ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు పలుమార్లు కార్మికుల బకాయిల గురించి లేఖలు రాశారన్నారు. కొన్ని ఫ్యాక్టరీలకు గత ప్రభుత్వం బకాయిలను చెల్లించిందని తెలిపారు. కోవూరు ఫ్యాక్టరీ విషయానికి వచ్చేసరికి ఎన్నికల కోడ్ రావడంతో బకాయిల చెల్లింపు ఆగిందన్నారు. కార్మికులకు న్యాయం చేయాలని చూస్తారే తప్ప కమీషన్ల కోసం ఎదురు చూడరని తెలుసుకోకుండా అసెంబ్లీలో అసత్యాలు చెప్పడాన్ని ఖండిస్తున్నామన్నారు. వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు అనూప్‌రెడ్డి మాట్లాడుతూ కార్మికుల పక్షాన ప్రసన్నకుమార్‌రెడ్డి పోరాటం చేశారన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యురాలు శ్రీలత, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు నరసింహులురెడ్డి, కవరగిరి ప్రసాద్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదు చేస్తే.. రాజీ కోసం బెదిరింపులు

- కావలి వన్ టౌన్ పోలీసుల నిర్వాకం

కావలి: రెండు కుటుంబాలు నడుమ వివాదం నెలకొంది. ఈ నేపథ్యంలో ఓ కుటుంబానికి చెందిన వివాహిత తన భర్తను చంపేస్తారని ఆందోళన చెంది పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసి న్యాయం చేయాలని కోరింది. అయితే పోలీసులు ఆమెను బెదిరించి, రాజీ అయినట్లుగా బలవంతంగా సంతకాలు చేయించి పంపించారు. కావలి వన్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఈ ఘటన జరిగింది. వివరాలిలా ఉన్నాయి. ఎలక్ట్రీషియన్‌గా పనిచేసే ఓ వ్యక్తి కుటుంబానికి, మరో కుటుంబానికి కొంత కాలంగా వివాదాలు కొనసాగుతున్నాయి. ఇటీవల ఎలక్ట్రీషియన్ ప్రత్యర్థి కుటుంబంలోని వ్యక్తితో దౌర్జన్యపూరితంగా వ్యవహరించడం, ఫోన్లు చేసి తిట్టడం, తీవ్రమైన హెచ్చరికలు చేయడం వంటివి శ్రుతిమించాయి. ఈ నేపథ్యంలో బాధిత వ్యక్తి భార్య శుక్రవారం ఉదయం వన్ టౌన్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి తన కుటుంబానికి ఎలక్ట్రీషియన్ నుంచి ప్రాణహాని ఉందని, భర్తను చంపేస్తారని ఆందోళన వ్యక్తం చేసింది. రక్షణ కల్పించాలని లిఖితపూర్వకంగా తెలియజేసింది. కాగా సాయంత్రం పోలీసులు సదరు మహిళను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించారు. ఆమెతో జుగుప్సాకరంగా ప్రవర్తించి, బెదిరించి ఎలక్ట్రీషియన్ కుటుంబంతో రాజీ చేసుకున్నట్లుగా, ఫిర్యాదును ఉపసంహరించుకున్నట్టుగా కాగితాలపై సంతకాలు చేయించుకున్నారు. స్టేషన్‌లో పోలీసులు వ్యవహరించిన తీరుకు ఆ మహిళ కన్నీరుమున్నీరైంది. ఈ ఘటనను చూసిన కొందరు పోలీసులు విస్తుపోయారు. కాగా ఇటీవల ఇదే స్టేషన్‌లో వివాదం విషయంలో ఓ వ్యక్తిని రాజీ చేసుకోవాలని, లేకపోతే అక్రమంగా కేసు పెట్టి వేధిస్తామని పోలీసులు హెచ్చరించారు. మనస్తాపం చెందిన అతను స్టేషన్ వద్దనే ఆత్మహత్యకు ప్రయత్నించాడు. దీంతో పోలీసులు ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం ప్రాణాపాయం నుంచి క్షేమంగా బయటపడ్డాడు.

ఆశ వర్కర్లను రెగ్యులర్ చేయాలని డిమాండ్


డీఎంహెచ్‌ఓకు సమస్యలు వివరిస్తున్న దృశ్యం

నెల్లూరు(వీఆర్సీసెంటర్): జిల్లాలోని ఆశ వర్కర్లను రెగ్యులర్ చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని ఏపీ ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి దుగ్గిరాల అన్నపూర్ణమ్మ డిమాండ్ చేశారు. శుక్రవారం నెల్లూరు డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో డీఎంహెచ్‌ఓ సుజాతకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అన్నపూర్ణమ్మ మాట్లాడుతూ పేద ప్రజలకు ఆరోగ్య సేవలందిస్తున్న ఆశ వర్కర్లను ప్రభుత్వ కార్మికులుగా గుర్తించాలన్నారు. ఎన్‌హెచ్‌ఎం స్కీం ఏర్పడి 20 సంవత్సరాలు పూర్తయినా వారికి కనీస వేతనం ఇవ్వడం లేదన్నారు. విధినిర్వహణలో మృతిచెందిన వారికి బీమా సౌకర్యం కల్పించాలన్నారు. ఆశాలను రెగ్యులర్‌చేసి హెల్త్ వర్కర్స్‌గా గుర్తించాలన్నారు.

పింఛన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా కోశాధికారి మధుసూదన, కల్యాణి, వాణి, జీవా, సునీత, గీత, సురేఖ తదితరులు పాల్గొన్నారు.

కండలేరులో 49.900 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో శుక్రవారం నాటికి 49.900 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. సత్యసాయి గంగ కాలువకు 580, లోలెవల్ కాలువకు 10, హైలెవల్ కాలువకు 80, మొదటి బ్రాంచ్ కాలువకు 25 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలియజేశారు.

జలాశయం (ఫైల్)



నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి	: రూ.85
సన్నవి	: రూ.50
పండ్లు	: రూ.30

